క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో హోమం



వెంకన్న ఆలయంలో హోమం చేస్తున్న భక్తులు

సీలేరు: సీలేరులోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో నెలరోజుల పాటు మృత్యుంజయ హోమం నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా కార్తీకమాసంలో ఈ మృత్యుంజయ హోమం చేయడం వలన గ్రామం సుభిక్షంగా ఉంటుందని, కుటుంబాలు సుఖ సంతోషాలతో వర్ధిల్లుతాయని ఆలయ అర్చకుడు శ్రీరామ్ పేర్కొన్నారు. సుమారు 30 రోజుల పాటు మృత్యుంజయ హోమం నిర్వహిస్తున్నామన్నారు. కార్తీక మాసం చివరలో పోలి పాడ్యమి నాడు పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించి హోమాన్ని నిలువరిస్తామని ఆయన తెలిపారు.

విద్యార్థులకు టాలెంట్ టెస్ట్



పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

రంపచోడవరం: రంపచోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఆదివారం టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వసుధ మాట్లాడుతూ విద్యార్థులు ఇలాంటి పోటీ పరీక్షల్లో పాల్గొవడం సంతోషంగా ఉందన్నారు. ఉద్యోగాల కోసం ఇలాంటి పోటీ పరీక్షలు రాయడం ద్వారా అనుభవం వస్తుందన్నారు. కళాశాల కెరీర్ గైడెన్స్ సెల్‌ను అభినందించారు. శ్రీధర్ సీసీఈ ఇన్స్టిట్యూషన్ (రాజమహేంద్రవరం) ఆధ్వర్యంలో నిర్వహించిన పరీక్షకు కళాశాల విద్యార్థులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి 95 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

నృసింహస్వామి దీక్ష మాలధారణకు ఏర్పాట్లు

సాక్షి, పాడేరు: సింహాచలం నృసింహస్వామి చందన దీక్షకు సంబంధించి డిసెంబర్ 11వతేది నుంచి మాలధారణ కార్యక్రమానికి ఏర్పాట్లు చేస్తున్నట్టు నృసింహ స్వామి దీక్ష ప్రచారకులు కోరెడ్డి సురేంద్రస్వామి ఆదివారం విలేకరులకు తెలిపారు. 32 రోజుల మండల దీక్ష పూర్తయిన తరువాత వచ్చే ఏడాది జనవరి 12న సింహాచలం నృసింహ స్వామి దర్శనం అనంతరం దీక్ష విరమణ జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు 9441755923 నంబర్‌కు సంప్రదించాలని ఆయన భక్తులను కోరారు.


ఏజెన్సీలో ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలి



ఎంపీటీసీ బుజ్జిబాబు

గూడెంకొత్తవీధి: జీవో నంబరు-3ను పునరుద్ధరించాలని కోరుతూ గూడెంకొత్తవీధిలో సోమవారం తలపెట్టిన నిరసన కార్యక్రమానికి నిరుద్యోగ యువత పెద్ద ఎత్తున తరలిరావాలని సీపీఎం నాయకుడు, గాలికొండ ఎంపీటీసీ సభ్యుడు అంపురంగి బుజ్జిబాబు ఆదివారం కోరారు. ఎన్నికల్లో ప్రచారంలో చంద్రబాబు అరకులోయ పర్యటనలో మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే జీవో నంబరు 3ను పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు పైబడినా హామీని అమలుచేయలేదన్నారు. సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. గిరిజన నిరుద్యోగుల కోసం ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం



ఉమా మహేశ్వరరావు

పాడేరు : కాఫీ సాగు చేస్తున్న గిరిజన రైతులు, పనిచేస్తున్న కూలీల పిల్లలకు కేంద్ర కాఫీ బోర్డు ద్వారా ఉపకార వేతనం అందజేయనున్నట్టు కేంద్ర కాఫీ బోర్డు సభ్యుడు కురుసా ఉమామహేశ్వరరావు వెల్లడించారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ చదువుతున్న వారికి ఏడాదికి రూ.5వేలు, డిగ్రీ విద్యార్థులకు రూ.7500, పీజీ విద్యార్థులకు రూ.15వేలు, ఆపై చదువులు చదువుతున్న వారికి రూ.20వేలు అందజేయనున్నట్టు పేర్కొన్నారు. గత ఏడాది పరీక్షల్లో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 50 శాతం, ఇతర విద్యార్థులు 60 శాతం మార్కులు సాధించి ఉండాలన్నారు. అర్హులు ఈనెల 30లోగా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

అంతర్రాష్ట్ర రహదారి.. అధ్వానంగా మారి

- రాళ్లు తేలి..గోతులతో దర్శనమిస్తున్న రోడ్డు
- ఇరుకైన మార్గంలో నిలిచిపోతున్న వాహనాలు
- గంటలతరబడి స్తంభిస్తున్న ట్రాఫిక్
- ప్రయాణికులకు తప్పని అవస్థలు
- పట్టించుకోని అధికారులు



గూడెం కొత్తవీధి- సీలేరు రహదారి దుస్థితి



ఇరుకైన మార్గంలో నిలిచిపోయిన బస్సులు

గూడెంకొత్తవీధి: పేరుకే అది అంతర్రాష్ట్ర రహదారి... ఉమ్మడి విశాఖ జిల్లా కేంద్రం నుంచి ఒడిశా, తెలంగాణ తదితర పొరుగు రాష్ట్రాలకు వెళ్లే ఏకైక మార్గం ఇదే కావడంతో దీనికి అంతర్రాష్ట్ర రహదారిగా గుర్తింపు పొందింది. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారి గత కొన్నేళ్లుగా పాలకు నిర్లక్ష్యానికి గురవుతూ వస్తోంది. పెచ్చులూడి అధ్వానంగా దర్శనమిస్తోంది. ఇటీవల సంభవించిన భారీ తుపాను ప్రభావంతో మరింత దయనీయంగా మారింది. పెద్ద పెద్ద గోతులతో నిండి ఉంది. రాకపోకలకు వాహనచోదకులు, ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. వర్షం పడితే గోతు ల్లో నీరు చేరి వాహనచోదకులు జారిపడి ప్రమా దాల బారిన పడుతున్నారు. ఈ మార్గం మీదుగా అధికారులు రాకపోకలు సాగిస్తున్నా చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారని, రోడ్డు మరమ్మతుకు కనీస చర్యలు తీసుకోవడం లేదని పలువురు చెబుతున్నారు.

నరకానికి నకళ్లుగా రహదారి

గూడెంకొత్తవీధి మండలంలోని ఆర్.వి.నగర్ నుంచి సీలేరు సమీపంలోని పాలకొండ వరకూ ప్రధాన రహదారి నిర్మాణానికి మొదటి నుంచి అవాంతరాలు ఎదురవుతూనే వస్తున్నాయి. గతంలో ఈ రహదారి నిర్మాణానికి ప్రభుత్వం నిధులు విడుదల చేసినా అటవీ శాఖ అభ్యంతరాల వల్ల పనులు ప్రారంభానికి నోచుకోలేదు. ఆ తరువాత పనులు మొదలయ్యే సరికి వర్షాల కారణంగా వేసిన రహదారుల నిర్మాణ సామగ్రి కొట్టుకుపోయింది. దీంతో పనులు చేపట్టిన కాంట్రాక్టరుకు నష్టం రావడంతో పనులను అర్ధంతరంగా నిలిపేశారు. పనులకు బిల్లులు రాకపోవడంతో కొందరు కాంట్రాక్టర్లు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ వివాదం కోర్టులో ఉండడంతో ఈ రహదారికి పూర్తిగా గ్రహణం పట్టింది. దీనికి తోడు మారుమూల మావోయిస్టు ప్రభావిత ప్రాంతం కావడంతో ఇటువైపు ఉన్నతాధికారుల రాక తక్కువగా ఉంటుంది. దీంతో ఈ ప్రాంత గిరిజనుల కష్టాలు అధికారుల దృష్టికి వెళ్లని పరిస్థితి నెలకొంది. ఇక్కడ రహదారి దుస్థితిపై తరచూ పత్రికల్లో కథనాలు వస్తున్నా.. అధికారులు ప్రతిపాదనలకే పరిమితమవుతున్నారు. దీంతో పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడిలా మారింది.

వర్షం పడితే.. అంతే

వర్షం పడినపుడు సమీపంలో వాగులు ఉధృతంగా ప్రవహించి..బురదనీరు ఈ రహదారిపై చేరడంతో రోడ్డు అంచులు కోతకు గురవుతున్నాయి. దీంతో ఈ దారంతా పెద్ద పెద్ద గోతులుగా మారింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఈ రహదారి మరింత ఛిద్రమైంది. సుమారు నెలరోజుల పాటు ఈ మార్గంలో వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఇటు తెలుగు రాష్ట్రాలతో పాటు ఒడిశాకు వెళ్లేందుకు అనేక ఇబ్బందులు పడ్డారు. రోడ్ల పైకి కొండచరియల మట్టి కొట్టుకువస్తోందని, దీంతో వాహనాలు బురదలో కూరుకుపోతున్నాయని వాహన చోదకులు, డ్రైవర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కలెక్టర్, ఐటీడీఏ పీఓలు పలుమార్లు ఈ రహదారులను పరిశీలించి త్వరితగతిన మరమ్మతులు పూర్తి చేసి రాకపోకలను పునరుద్ధరించాలని ఆదేశించారు. ప్రస్తుతానికి తాత్కాలికంగా రహదారులకు మరమ్మతులు చేపట్టి రాకపోకలు పునరుద్ధరించినా కొద్దిపాటి వర్షానికే మళ్లీ పరిస్థితి యథావిధిగా ఇబ్బందికరంగా మారుతుందని స్థానికులు చెబుతున్నారు.వర్షం కురిస్తే సీలేరు, భద్రాచలం మార్గంలో బస్సు సర్వీసులను తరచూ నిలిపివేస్తున్నారంటున్నారు.

ప్రైవేటు వాహనదారులు ఇదే అదనుగా అధిక మొత్తంలో రవాణా చార్జీలు వసూలు చేసి రాకపోకలు సాగిస్తున్నారు. అయితే డ్రైవర్లు నిబంధనలు అతిక్రమించి అధిక ప్రయాణికులతో.. అతివేగంగా ప్రయాణాలు చేస్తుండడంతో అమాయక గిరిజనుల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్గం సింగిల్ రోడ్డు కావడంతో, ఇరుకుగా ఉండడంతో తరచూ పెద్ద పెద్ద వాహనాలు నిలిచిపోవడంతో గంటల తరబడి ట్రాఫిక్ స్తంభించి ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిత్యం ఇబ్బందులు



ఏ చిన్న అవసరానికైనా మండల కేంద్రానికి వెళ్లాలంటే రవాణా సదుపాయాలు ఉండడం లేదు. రహదారి గోతులమయమైంది. సీలేరుకు వచ్చే బస్సులే అతి తక్కువ..అవి కూడా వర్షాలు వస్తే నిలిపివేస్తున్నారు. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. రోడ్డు పెద్ద పెద్ద గోతులతో దర్శనమిస్తోంది. ప్రయాణానికి ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి రహదారికి మరమ్మతు పనులు చేయించాలి. –బి.కృష్ణ, నేరేడుపల్లి, జీకే వీధి మండలం

అధికారుల నిర్లక్ష్యం



వర్షాల కారణంగా సీలేరు వెళ్లే రహదారి పలుచోట్ల కోతకు గురైంది. అధికారులు వచ్చి చూసి వెళ్తున్నారు తప్ప సమస్యను పరిష్కరించడం లేదు. రహదారికి శాశ్వత మరమ్మతులు చేపట్టాలి. రవాణా సదుపాయాలను మెరుగుపరచాలి. సీలేరు ప్రాంతం మరింత అభివృద్ధి చెందేందుకు, రహదారి మరమ్మతు కోసం అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి

– కేలేబుకుమారి, సర్పంచ్, దుప్పిలవాడ

రహదారి నిర్మాణానికి చర్యలు

ఆర్.వి.నగర్ నుంచి పాలగెడ్డ వరకూ రహదారి నిర్మాణానికి అవసరమైన నిధులు విడుదలయ్యాయి. జిల్లాకు సుమారు రూ.43 కోట్ల కేటాయించగా అందులో రూ.33 కోట్లు ఆర్వీనగర్– సీలేరు రహదారికే కేటాయించారు. త్వరలో టెండర్లు పూర్తయితే నిర్మాణ పనులు మొదలుపెడతాం.

–భరత్, ఆర్అండ్‌బీ ఏఈఈ

చాపరాయిలో ముమ్మరంగా గస్తీ



చాపరాయిలో రాత్రి గస్తీ నిర్వహిస్తున్న ఎస్ఐ పాపినాయుడు, పోలీసు సిబ్బంది

డుంబ్రిగుడ: పర్యాటక కేంద్రం చాపరాయిలో రాత్రి సమయంలో గస్తీ నిర్వహిస్తున్నట్టు ఎస్ఐ పాపినాయుడు చెప్పారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ చాపరాయిలో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు జరగకుండా, గంజాయి, మద్య వంటి మత్తుపదార్థాలు సేవించే వారిని లోనికి రాకుండా ఉండేందుకు అన్ని విధాల చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన చాపరాయి నిర్వాహకులతో మాట్లాడుతూ రాత్రిళ్లు మందబాబులను, గంజాయి తీసుకున్న వారిని లోపలికి రానివ్వద్దని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చాపరాయి నిర్వాహకులు అప్పారావు, సంతోష్, సూరిబాబు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సన్మానం



రిటైర్డ్ ఎస్ఐ దంపతులను సన్మానిస్తున్న గ్రామస్తులు

చింతూరు: మండలంలోని చట్టి గ్రామానికి చెందిన రిటైర్డ్ ఎస్ఐ బొడ్డు అప్పారావును ఆదివారం గ్రామస్తులు, సహచరులు ఘనంగా సన్మానించారు. 40 ఏళ్ల పాటు పోలీసు శాఖలో విధులు నిర్వహించిన ఆయన భద్రాచలం ఎస్ఐగా పని చేస్తూ ఇటీవల ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ అప్పారావు దంపతులను స్థానికులు తదితరులు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని అధికారుల ప్రశంసలు, ప్రజల మన్ననలు పొందుతూ నిస్వార్థంగా ఆయన విధులు నిర్వహించారని కొనియాడారు.

గ్రామాల్లో తాగునీటి సదుపాయం



ట్యాంకు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ శారద

డుంబ్రిగుడ: మండలంలోని అరకు మేజర్ పంచాయతీలో నేరేడువలస వీధిలో జల్‌జీవన్ మిషన్ నిధులతో తాగునీరు అందించేందుకు ప్రతి చోట కుళాయిలు ఏర్పాటు చేస్తున్నట్టు సర్పంచ్ జి.శారద తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం 20 వేల లీటర్ల ట్యాంక్ నిర్మాణానికి ఆమె శంకుస్థాపన చేశారు.

అనంతరం ఆమె మాట్లాడుతూ పంచాయతీలో సుమారు 8వేల మంది వరకు ఉన్నారని, తాగునీటి సౌకర్యం అంతంత మాత్రం ఉండడంతో పూర్తి స్థాయిలో అందించే సంకల్పంతో 100 నుంచి 120 గృహాలకు తాగునీటి సదుపాయం కల్పిస్తున్నట్టు చెప్పారు. ఇంజినీరింగ్ శాఖ అధికారి మహేశ్, కాంట్రాక్టర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆదివాసీ చట్టాలను పకడ్బందీగా అమలుచేయాలి



నినాదాలు చేస్తున్న పరిషత్ నాయకులు

చింతూరు: ఐదవ షెడ్యూల్ ప్రాంతంలో ఆదివాసీ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు బంగారు వెంకటేశ్వర్లు అన్నారు. చింతూరులో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదివాసీ నిరుద్యోగులకు ఉద్యోగాల కోసం ప్రత్యేకమైన చట్టాలను అమలు చేయాలన్నారు. పీసా చట్టాన్ని పటిష్టంగా అమలు చేయడంతో పాటు ఆదివాసీల గ్రామ పరిపాలన వ్యవస్థను బలోపేతం చేయాలని, ఆదివాసీ పూజారులకు గౌరవ వేతనం అందించాలని కోరారు. పోలవరం ప్రాజెక్టుతో ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు కనుమరుగు కానున్నాయని, వారికి మెరుగైన ప్యాకేజీ అందించి పునరావాసం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. బిర్సాముండా జయంతి సందర్భంగా నిర్వహిస్తున్న సదస్సును విజయవంతం చేయాలని ఆయన కోరారు. ప్రతినిధులు వీరభద్ర, కృష్ణ, వీరయ్య, దుర్గారెడ్డి, రాఘవయ్య, లక్ష్మణరావు, సంకురమ్మ, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల అపూర్వ కలయిక



చింతపల్లిలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

చింతపల్లి: చింతపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పూర్వ విద్యార్థుల కలయికతో పండగ వాతావరణం నెలకొంది. ఇదే పాఠశాలలో 1987–88 విద్యా సంవత్సరంలో పదవ తరగతి పూర్తి చేసి 37 సంవత్సరాల అనంతరం ఆదివారం పూర్వ విద్యార్థులంతా అదే పాఠశాలలో కలిశారు. ఈ సందర్భంగా వారు చిన్ననాటి జ్ఞాపకాలను నెమరవేసుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. ఒకొరికొకరి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. దీంతో మధ్యాహ్నం వరకు పాఠశాలలో సందడి వాతావరణం నెలకొంది. అనంతరం మండల కేంద్రానికి సమీపంలో గల చిన్నగెడ్డ కాఫీ తోటల్లో ఏర్పాటు చేసిన వనసమరాధనలో పాల్గొని సహపంక్తి భోజనాలు చేశారు. చింతపల్లి పూర్వ విద్యార్థులైన దురియా హేమంత్‌కుమార్, సత్తిబాబు, శ్రీను, సత్యనారాయణ, రామకృష్ణ, నగేష్, జోగిరాజు తదితర మిత్ర బృందం ఏర్పాటు చేశారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

సీలేరు: సీలేరులోని రామాలయంలో ప్రతీ ఆదివారం చిన్నారులకు భగవద్గీత శ్లోకాలు, హనుమాన్ చాలీసా తదితర మంత్రాల పఠనంపై ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్టు ఆలయ అర్చకుడు శ్రీ రమాచారి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులో మాట్లాడుతూ ఆధ్యాత్మిక భావాన్ని అలవర్చుకోవాలన్నారు. ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. పిల్లల్లో సనాతన ధర్మాన్ని, అధ్యాత్మికతను పెంపొందించేందుకు పలు కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. రామాలయ కమిటీ అధ్యక్షుడు సాంబమూర్తి, ఉపాధ్యాయుడు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

లోఓల్టేజీ సమస్యతో అవస్థలు



సర్పంచ్ అప్పారావు

అనంతగిరి(అరకులోయ రూరల్): మండలంలో అతి మారుమూల గుమ్మకోట పంచాయతీ పరిధిలో ఉన్న దొండవలస, లోగుమ్మకోట, దబలపాడు, గాలిపాడు, గెడ్డవలస, గ్రామాల్లో విద్యుత్ లోఓల్టేజీ సమస్య తీవ్రంగా ఉన్నట్టు సర్పంచ్ అప్పారావు తెలిపారు. గ్రామాల్లో లోఓల్టేజీ సమస్యపై పలుమార్లు విద్యుత్ శాఖ డీఈ, ఏఈలకు పలుమార్లు వినవించుకున్నా సమస్య పరిష్కరం కాలేదన్నారు. అవసరమైన చోట్ల ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని దీంతో శివారు గ్రామల గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గాలిపాడు గ్రామంలో విద్యుత్ లోవోల్టేజీ ఉండడంతో తాగునీటి సరఫరాకు విద్యుత్ సరఫరా సరిపోవడం లేదని, ఫలితంగా నీరు పంపింగ్ కావడం లేదంటున్నారు. ఫలితంగా గ్రామంలో తాగునీటి సమస్య వేధిస్తోందని చెప్పారు. గ్రామస్తులు తాగునీటి కోసం కిలోమీటర్లు దూరం వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రత్యేక చొరవ తీసుకొని గ్రామాల్లో లోఓల్టేజీ సమస్య పరిష్కరించాలని ఆయన కోరుతున్నారు.

13న లక్ష్మీనృసింహస్వామి విగ్రహ ప్రతిష్ట



లక్ష్మీనృసింహస్వామి విగ్రహం

గూడెంకొత్తవీధి: మండలంలోని ఏబులం గ్రామంలో లక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో ఈనెల 13తేదీన విగ్రహ ప్రతిష్ఠ జరపనున్నట్టు సింహాచలం నృసింహస్వామి దీక్ష ప్రచారకులు సురేంద్రస్వామి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు . ఆ రోజు ఉదయం 10.45 గంటలకు విగ్రహ ప్రతిష్ఠ జరుగుతుందని, భీమిలికి చెందిన సద్గురు సాయి ఆశ్రమం, జి.మాడుగుల ఆశ్రమ నిర్వహకులు సాయిరామ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు. భక్తులకు స్వామి వారి చిత్రపటాల పంపిణీ, అన్నసమారాధన వంటి కార్యక్రమాలుంటాయని ఆయన తెలిపారు.

కానరాని సౌకర్యాలు.. విద్యార్థుల అవస్థలు



జోడిగుమ్మ గ్రామంలో శిథిలావస్థ షెడ్డులో కొనసాగుతున్న తరగతులు

ముంచంగిపుట్టు: మండలంలోని అత్యంత మారుమూల రంగబయలు పంచాయితీలోని జోడిగుమ్మ గ్రామంలో ఉన్న ఎంపీపీ పాఠశాలకు భవనం లేదు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం పాడైన షెడ్డులోనే పాఠశాల కొనసాగుతోంది. ఇక్కడ సుమారు 32 మంది విద్యార్థులున్నారు. మట్టి గోడలు, శిథిలమైన షెడ్డులో చదువులు కొనసాగిస్తున్నారు. వర్షం పడితే పరిస్థితి మరింత దారుణంగా ఉంటుందని గ్రామస్తులు చెబుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చదువుపై ఉన్న మమకారంతో విద్యార్థులు సమస్యలతో సహవాసం చేస్తున్నారంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు. ఈ విషయంపై ఎంఈవో కృష్ణమూర్తి మాట్లాడుతున్న సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, పాఠశాల కోసం ప్రతిపాదనలు పంపినట్టు చెప్పారు.

అటవీ అమరవీరులకు ఘన నివాళి



అమరవీరులకు నివాళులర్పిస్తున్న అరకులోయ రేంజర్ శ్రీనివాసరావు



రాజవొమ్మంగి అటవీక్షేత్ర కార్యాలయం వద్ద అటవీ అమరవీరుల సంస్మరణ కార్యక్రమంలో పాల్గొన్న సిబ్బంది

అరకులోయటౌన్: అటవీ అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం అరకులోయ అటవీ శాఖ (టీ) రేంజ్ కార్యాలయంలో రేంజర్ పి. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి అటవీ అమరవీరులకు ఘన నివాళిలర్పించారు. ఈ సందర్భంగా రేంజర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ అడవులను, వన్యప్రాణులను కాపాడే క్రమంలో ప్రాణాలను కొల్పోయిన అటవీశాఖ అమరవీరులకు నివాళిలర్పించినట్టు తెలిపారు. అమర వీరుల త్యాగాలను స్మరించుకొని, వృత్తి పట్ల నిబద్ధతతో మెలగాలని సిబ్బందికి సూచించారు. అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: స్థానిక అటవీక్షేత్ర కార్యాలయంలో ఆదివారం అటవీ అమరవీరుల సంస్మరణ దినాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా విధి నిర్వహణలో అసువులు బాసిన పందిళ్లపల్లి శ్రీనివాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి అధికారులు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహించారు. అమరవీరులకు జోహార్లు అంటూ నినాదాలు చేశారు. రేంజ్ అధికారి ఉషారాణి, ఎఫ్ఎస్ఓ రాము ఎఫ్‌బీఓలు, ఏబీఓలు, బేస్ క్యాంప్ సిబ్బంది, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

400 మందికి వైద్య పరీక్షలు



వైద్య శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

రంపచోడవరం: మండల కేంద్రంలో రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య శిబిరంలో వైద్యులు టీవీ సుబ్బారావు, రాయుడు శ్రీనివాస్, దాసరి ఉమమహేష్, ఎస్.సంపత్‌కుమార్‌లు పాల్గొని సుమారు 400 మందికి వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి రక్త పరీక్షలు నిర్వహించారు. పరమహంస యోగానంద నేత్రాలయం, వేమగిరి ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం నిర్వహించారు.87 మందికి కంటి పరీక్షలు చేసి 22 మందికి కళ్లద్దాలు అందజేశారు. పది మందికి కంటి ఆపరేషన్ల నిమిత్తం వేమగిరి నేత్రాలయానికి తరలించారు. జీబీఆర్ ఫౌండేషన్ ద్వారా ఫిట్స్ క్యాంప్ నిర్వహించారు. డాక్టర్ గోపాలం శివన్నారాయణ, సిబ్బంది పాల్గొని 76 మందికి ఫిట్స్‌కి సంబంధించిన మందులు అందజేశారు. ఫిట్స్ పై అవగాహన కల్పించారు. రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మాట్లాడుతూ రామకృష్ణ మిషన్ ద్వారా అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైద్య శిబిరానికి వచ్చిన రోగులకు, సహాయకులకు భోజన సదుపాయం నిర్వహించారు. క్యాంప్ కో–ఆర్డినేటర్ కె.శ్రీనివాస్, యోగానంద నేత్రాలయం ప్రోగ్రామ్ మేనేజర్ ఎన్.చంటిబాబు, వలంటీర్లు అప్పారావు, సూర్య, వర్మ, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.